**ప్రజల మాట ప్రగతి బాట**

**నాగార్జున సాగర్ నియోజకవర్గం**

# హాలియా గులాబీమయం

- సీఎం కేసీఆర్ సభకు భారీగా తరలివచ్చిన జనం
- ప్రజలను ఆలోచింపజేసిన సీఎం కేసీఆర్ ప్రసంగం

హాలియా, నవంబర్ 14 : సీఎం కేసీఆర్ రాకతో హాలియా జనసంద్రమైంది. మంగళవారం హాలియాలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ వస్తుండడంతో నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తమ అభిమాన నాయకుడిని చూసేందుకు ఆయన ప్రసంగం వినేందుకు భారీగా తరలివచ్చారు. యువకలు బైక్‌లపైన, రైతులు, కూలీలు ట్రాక్టర్లపైన ర్యాలీగా వచ్చారు. మహిళలు కూడా అధిక సంఖ్యలో తరలిరావడంతో హాలియా వీధులన్నీ జనంతో కిటకిటలాడినాయి. జై తెలంగాణ, జై కేసీఆర్ నినాదాలతో హాలియా మార్మోగింది.


త్రిపురారం : మండల కేంద్రం నుంచి హాలియాకు ర్యాలీగా తరలివెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు, స్థానికులు

## ఆకట్టుకున్న సీఎం కేసీఆర్ ప్రసంగం

హాలియా : హాలియాలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ ప్రసంగం నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రజలను ఆకట్టుకుంది. ఆయన ప్రసంగాన్ని ప్రజలంతా శ్రద్ధగా విన్నారు. ''మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలైనా నేటికీ ప్రజల్లో రాజకీయ పరిణతి రాలేదు. ఎన్నికలు వస్తాయి పోతాయి, మీరు కూడా చాలామందికి ఓటు వేసి ఉంటారు. కానీ నేను ఇక్కడ చెప్పే మాటలు విని, మీరు గ్రామాలకు వెళ్లిన తరువాత ప్రజల మధ్య చర్చ పెట్టాలి. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు మీ తలరాతలను మారుస్తుంది. మిమ్ముల్ని ఎవరు పాలించాలి, ఎవరి వద్ద ఉంటే క్షేమంగా ఉంటారో మీరు ఆలోచించుకోవాలి. అభ్యర్థిగురించి, పార్టీ చరిత్ర గురించి, నడివడిక గురించి ఆలోచించాలి. ఏ పార్టీకి అధికారం ఇస్తే మంచిది. ఎవరు అధికారంలోనికి వస్తే మేలు జరుగుతుందో ప్రజలు ఆలోచించాలి.'' అని సీఎం కేసీఆర్ చెప్పిన మాటలు ప్రజలను ఆలోచింపజేశాయి. కాంగ్రెస్ పార్టీ 50 ఏండ్లు దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించింది. ఎవరి కాలంలో ఏం జరిగిందో ఆలోచించాలి. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలను ఆదుకోలేదు. నేను ముఖ్యమంత్రి అయిన రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో పరిస్థితులు ఘోరంగా ఉండేవి. పశువులు తినేందుకు గడ్డికూడా దొరికేది కాదు. గ్రాసం లేక రైతులు పశువులను కబేళాలకు అమ్మేవారు. నేను మూడు, నాలుగు నెలలు ఆర్థిక నిపుణులతో మాట్లాడి కరెంట్ మీద కరెంటు మీద నిర్ణయం తీసుకున్నా. వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తేనే రైతులకు మేలు జరుగుతదని భావించి అమలు చేశా. అంటూ సీఎం కేసీఆర్ వివరించారు. .

## సీఎం మాటలకు చప్పట్ల మోతలు

''భగత్ ఎప్పుడూ మీ మధ్యనే ఉండేటోడు.. యువకుడు, బలహీనవర్గాల బిడ్డ.. భగత్‌ను గెలిపిస్తే కులమతాలకు అతీతంగా నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రజలకు మేలు జరుగుతది. భగత్‌ను గుండెలకు హత్తుకొని గెలిపించండి మీ అభివృద్ధి నా బాధ్యత'' అని సీఎం అనడంతో సభలో చప్పట్లు మార్మోగాయి. తాను రాష్ట్రానికి ముఖ్యమంత్రినైతానని జానారెడ్డి పంచరంగుల కల కంటుండని ముఖ్యమంత్రి అనడంతో సభికులు చప్పట్లు కొట్టారు. రైతుబంధు గురించి ప్రపంచంలో ఏ నాయకుడు ఆలోచన చేయలేదని, వ్యవయానికి 24 గంటల కరెంట్ ఇస్తున్నాం.ధరణి పోర్టల్ తీసుకువచ్చాం. రైతు పండించిన ధాన్యాన్ని కొనుగోలుచేసున్నాం. కానీ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి రైతుబంధు అంటే దుబారా అంటున్నాడు. మీరే చెప్పండి మీకు రైతుబంధు ఉండాలా వద్దా అంటూ సీఎం కేసీఆర్ అడగ్గా సభలోని ప్రజలంతా చేతులు పైకెత్తి తమకు రైతుబంధు కావాలని ముక్తకంఠంతో చెప్పారు. ''మీరు భగత్‌ను గెలిపిస్తే మీకు ఇప్పుడు ఇస్తున్న రైతుబంధును 16 వేల రూపాయలు చేస్తానని ముఖ్యమంత్రి అనడంతో ప్రజలు చప్పట్లు కొట్టారు. రాష్ట్రంలో 3 కోట్ల మందికి కంటి పరీక్షలు నిర్వహించి 80 లక్షల మందికి కంటి అద్దాలు అందజేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. కేసీఆర్ కిట్ ఇచ్చాం, అమ్మఒడి కింద ప్రభుత్వ ఆస్పత్రిలో పుట్టిన మగబిడ్డకు రూ.12వేలు, ఆడబిడ్డకు రూ. 13వేలు ఇస్తున్నాం. రేపు మళ్లీ అధికారంలోకి వస్తే రేషన్‌షాపుల ద్వారా అందరికీ సన్న బియ్యం ఇస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇవ్వడంతో సభలో కరతాల ధ్వనులు వినిపించాయి. వంద శాతం భగత్‌ను గెలిపిస్తే మీ పనులు నేను పూర్తి చేయిస్తానని సీఎం కేసీఆర్ అనడంతో చప్పట్లు మార్మోగాయి.

## ఆలోచింపజేసిన సీఎం మాటలు

''కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి 3గంటల ఉచిత విద్యుత్ సరిపోతదని మాట్లాడుతుండు. మీరు చెప్పండి ఎన్ని గంటలు కావాలో. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ కావాలంటే నోముల భగత్‌ను గెలిపించాలి.'' అని కోరారు. తాము అధికారంలోకి వస్తే దరణి పోర్టల్ తీసివేస్తామని రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి, భట్టి మాట్లాడుతున్నారని, ధరణి తీసేస్తే రైతుల ఖాతాలో డబ్బులు ఎలా వేస్తారని కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పేదలను పట్టించుకోలేదని, 200 రూపాయల పింఛన్ ఇచ్చి మీ చావు మీరు చావండని వదిలేసారని చెప్పారు. ''ఎవరు మీరు మంచి చేసింద్రో ఎవరు మీకు చెడు చేసింద్రో మీరే ఆలోచించుకోవాలి. ఏది రాయినో ఏది రత్నమే మీరే గుర్తించాలి. ఖర్మగాలి కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే వాళ్లు అధికారంలోనికి వస్తే మీ జీవితాలు వైకుంఠపాళి, రైతుబంధుకు రాంరాం, దళితబంధుకు జై భీం అన్నట్లే'' అని సీఎం కేసీఆర్ అనడంతో ప్రజలు ఆలోచనలో పడ్డారు.


నిడమనూరు : వెనిగండ్ల గ్రామం నుంచి ర్యాలీగా ప్రజా ఆశీర్వాద సభకు తరలివెళ్తున్న నాయకులు, కార్యర్తలు, ప్రజలు


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ సురేందర్‌రెడ్డి

## బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- మర్రిగూడ జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి

మర్రిగూడ, నవంబర్ 14 : రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని శివన్నగూడెంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించి ఓటు అభ్యర్థించాలని సూచించారు. ఉప ఎన్నిక తర్వాత నియోజకవర్గంతో పాటు మర్రిగూడ మండలం అభివృద్ధి పథంలో పయనిస్తున్నదన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు చేస్తున్న మోసపూరిత వాగ్దానాలను ప్రజల్లో ఎండగట్టాలన్నారు. మునుగోడులో బీఆర్ఎస్ గెలిస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మరో మారు కూసుకుంట్లను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోటకూరి శంకర్‌యాదవ్, ఎంపీటీసీ దాసరి మమతాగోపాల్, ఉప సర్పంచ్ సంకబుడ్డి మమతానర్సింహ, నాయకులు వంగాల రవీందర్‌రెడ్డి, ఆకారపు శ్రీనివాస్, బొడ్డు రవి, కాటం వెంకటయ్య, బండి యాదయ్య, నున్నగోపుల గిరి, సంకబుడ్డి రమేశ్, ఊరిపక్క మహేందర్, దేప శిశుపాల్‌రెడ్డి, ఆకారపు సంజీవ పాల్గొన్నారు.

## బీజేపీ నాయకుల తప్పడు ఆందోళన .. హితవు చెప్పిన గిరిజనులు

హాలియా, నవంబర్ 14 : హాలియాలో మంగళవారం జరిగే బహిరంగ సభకు సీఎం కేసీఆర్ వస్తున్న విషయం తెలుసుకున్న నాగార్జునసాగర్ నియోజకవర్గానికి చెందిన కొందరు బీజేపీ నాయకులు తిరుమలగిరి సాగర్ మండలంలో సీఎం కేసీఆర్ నెల్లికల్లు లిఫ్టుకు శంకుస్థాపన చేసిన శిలాఫలకం వద్ద తప్పుడు ఆందోళనకు దిగారు. అటుగా వెళ్తున్న గిరిజనులు, సీఎం కేసీఆర్ బహిరంగ సభకు వస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గిరిజనులు బీజేపీ నాయకుల తీరును చూసి ఆశ్చర్యానికి గురయ్యారు. నెల్లికల్లు లిఫ్టు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతుంటే వీళ్ల ఆందోళన ఏమిటీ అని అవాక్కయ్యారు. నెల్లికల్లు లిఫ్టును మొదట 75 కోట్ల రూపాయలతో 5 వేల ఎకరాలకు సాగు నీరు ఇచ్చేవిధంగా డిజైన్ చేశారు. మండలంలో ఇంకా 20 వేల ఎకరాల బీడుభూములకు సాగునీరు అందించాల్సి ఉందని స్థానిక బీఆర్ఎస్ నాయకులు లిఫ్టు పనుల శంకుస్థాపనకు వచ్చిన సీఎం కేసీఆర్‌కు తెలిపారు. స్పందించిన ముఖ్యమంత్రి కేసీఆర్ నెల్లికల్లు లిఫ్టును 5వేల ఎకరాలకు కాకుండా 25 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా రీడిజైన్ చేయాలని అధికారులను ఆదేశించారు. దాంతో లిఫ్టు నిర్మాణ పనులు కాస్త ఆలస్యమయ్యాయి. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఇంజినీర్లు నెల్లికల్లు లిఫ్టు సామర్థ్యాన్ని 5వేల నుంచి 25వేల ఎకరాలకు పెంచడంతో ప్రభుత్వం రూ.75 కోట్ల వ్యయాన్ని రూ. 684 కోట్లకు పెంచింది. దాంతో ఆరు నెలలుగా నెల్లికల్లు లిఫ్టు నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ప్రాంత గిరిజనులు సైతం నెల్లికల్లు లిఫ్టు నిర్మాణ పనుల ప్రగతిని రోజూ గమనిస్తున్నారు. ఎన్నికల వేళ ఓట్ల కోసం గిరిజనులను తప్పుదారి పట్టించేందుకు బీజేపీ నాయకులు నెల్లికల్లు లిఫ్టు శిలాఫలకం వద్ద ఆందోళనకు దిగారు. బీజేపీ నాయకులు సీఎం కేసీఆర్‌ను నోటికి వచ్చినట్లు మాట్లాడు తుండటంతో.. నెల్లికల్లు లిఫ్టు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్న వేళ మీరు ఓట్ల కోసం తప్పుడు ఆందోళన చేయడం సరికాదని గిరిజనులు బీజేపీ నాయకులకు సర్దిచెప్పారు. అయినా వారు వినకపోగా అభం శుభం తెలియని గిరిజనులపైకి బీజేపీ నాయకులు దౌర్జన్యానికి దిగారు. పైగా ఎన్నికల వేళ ఓట్లు రాబట్టుకునేందుకు, గిరిజనులపైకి దౌర్జన్యానికి దిగిన బీజేపీ నాయకులే తిరిగి ఆస్పత్రిలో చేరి, సింపతి పొందేందుకు ప్రయత్నిస్తున్న తీరుపై తిరుమలగిరి సాగర్ మండలంలోని గిరిజనులు మండి పడుతున్నారు. ఓట్లు కావాలంటే బీజేపీ నాయకులు గిరిజన ప్రజల మనస్సులు గెలవాలే కానీ తప్పుడు పద్ధతిలో ఓట్లను రాబట్టుకోవాలనుకోవడం సరికాదని హితవు పలుకుతున్నారు.


గుర్రంపోడు : కోలాటాలతో సీఎం కేసీఆర్ సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి, నాయకులు


త్రిపురారం : మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కామెర్ల జానయ్య ఆధ్వర్యంలో 120 బైక్‌లతో హాలియాకు తరలి వెళ్తున్న యువకులు, బీఆర్ఎస్ శ్రేణులు

## ప్రజా ఆశీర్వాద సభ సైడ్‌లైట్స్

- మధ్యాహ్నం 2:55 గంటలకు సీఎం కేసీఆర్ హెలికాప్టర్ సభా ప్రాంగణం వద్దకు వచ్చి చక్కర్లు కొట్టింది. ప్రజలు సీఎం హెలికాప్టను చూసి కేరింతలు కొట్టారు.
మధ్యాహ్నం 3 గంటలకు సీఎం హెలికాప్టర్ హెలిప్యాడ్ వద్ద దిగింది.
- 3:12 గంటలకు సీఎం కేసీఆర్ సభా వేదికపైకి చేరుకున్నారు. అనంతరం ప్రజలకు అభివాదం చేయడంతో ప్రజలు ఉత్సాహంగా జై తెలంగాణ నినాదాలు చేశారు.
- 3:15 గంటలకు నాగర్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ ప్రజలనుద్దేశించి మాట్లాడారు.
- మధ్యాహ్నం 3:24 గంటలకు సీఎం కేసీఆర్ ప్రజల నుద్దేశించి తన ప్రసంగాన్ని ప్రారంభించారు.
- సీఎం కేసీఆర్ తన ప్రసంగంలో వ్యవసాయానికి ఉచిత 24గంటల కరెంట్ పథకం ప్రారంభం ఎలా జరిగిందనే విషయం చెప్పగానే సభా ప్రాంగణం ఒక్కసారిగా చప్పట్లతో దద్దరిల్లింది.
- వ్యవసాయానికి 24 గంటల కరెంట్ కావాలా.. కాంగ్రెస్ వాళ్లు చెప్పినట్లు 3 గంటలు కావాలా అంటూ సీఎం కేసీఆర్ ప్రశ్నించగా.. రైతులందరూ చేతులెత్తి తమకు 24గంటల కరెంట్ కావాలంటూ నినదించారు.
- మధ్యాహ్నం 3:47 గంటలకు సీఎం కేసీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు.
- స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు సీఎం కేసీఆర్‌ను శాలువాలతో సన్మానించారు.
- మధ్యాహ్నం 3:50 గంటలకు సీఎం కేసీఆర్ వేదిక దిగి ప్రత్యేక బస్సులో హెలిప్యాడ్ వద్దకు బయల్దేరారు.
- 3:58 గంటలకు హెలికాప్టర్ ద్వారా ఇబ్రహీంపట్నం సభకు బయల్దేరి వెళ్లారు.

–పెద్దవూర, నవంబర్ 14

## సభను జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు : ఎమ్మెల్యే భగత్

హాలియాలో సీఎం కేసీఆర్ సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేసిన ప్రజలకు, అందుకు కృషి చేసిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. తనను ఆశీర్వదించేందుకు భారీగా ప్రజలు తరలిరావడం సంతోషకరమని, వారి ప్రేమాభిమానాలు వెలకట్టలేనివని, వారి సహకారం, తోడ్పాటు ఎల్లవేళలా ఉండాలని కోరారు. ప్రజల ఆశీర్వాదంతో రాబోయే ఎన్నికల్లో గెలిచిన తరువాత మరింత సేవ చేసి నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.